క్లుప్తంగా

ఘనంగా మల్లన్న జాతర



పోతరాజుల విన్యాసాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో శ్రీమల్లికార్జునస్వామి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామ గోకుల్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోతురాజుల విన్యాసాలతో భక్తిశ్రద్ధలతో గంగకు వెళ్లారు. కాగా 6న మల్లన్న కల్యాణం, అగ్నిగుండాలు, బోనాలు, 7న నాగవెల్లి, బోనాలు, 8న రేణుకా ఎల్లమ్మదేవి కల్యాణం, బోనాలు చేస్తారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠ



బోనాల ఊరేగింపులో భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహ్మద్ నగర్ పంచాయతీ పరిధిలోని కన్నారం గ్రామంలో ఆదివారం గంగామ్మదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో చెరువుకట్ట వద్ద గంగమ్మ ఆలయం నిర్మించి, వేదపండితుల ఆధ్వర్యంలో దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం గ్రామస్తులు బోనాలను సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛభారత్



రైతు వేదిక వద్ద పిచ్చి మొక్కలు తొలగిస్తున్న యువకులు

మనోహరబాద్(తూప్రాన్): మండల పరిధిలోని కూచారం గ్రామంలో ఆదివారం నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం 251వ స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు వేదిక పరిసరాల్లో శ్రమదానం నిర్వహించి, పిచ్చి మొక్కలు తొలగించి, హరితహారం మొక్కలకు పాదులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నేచర్ ఐకాన్ యూత్‌తో పాటు గ్రామ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



నియామక ఉత్తర్వులు అందిస్తున్న నాయకులు

నర్సాపూర్: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నాయకులు, కార్యకర్తలు తమ వంతు కృషి చేస్తారని జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు షేక్ మజహర్ చెప్పారు. ఆదివారం ఆయన నర్సాపూర్ వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో పర్యటిస్తూ మైనార్టీ విభాగం మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కాగా నర్సాపూర్ పట్టణ శాఖ మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా రబ్బాని, ప్రధాన కార్యదర్శిగా నవాజ్‌లను నియమించి, వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు హకీం, రిజ్వాన్, అజ్మత్, అంజనేయులుగౌడ్, సురేశ్, రషీద్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

దుబ్బాకరూరల్: మండలంలోని చీకోడ్ గ్రామంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ భవనం ప్రారంభించడంతో పాటుగా రూ.కోటి 20లక్షల నిధులతో చేపట్టనున్న అంబేడ్కర్, రెడ్డి సంఘం, రజక, విశ్వబ్రహ్మణ, మజీద్ కమిటీ, ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాల నిర్మాణానికి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం శిలాజీనగర్ గ్రామంలో గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జూట మాటలు, మాయమాటలతో గెలిచిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రజలకు చేసిందేమి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తే సమయానికి వచ్చి కత్తెర పట్టి కత్తిరించడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత, సర్పంచ్ తౌడ శ్రీనివాస్, ఎంపీటీసీ రాంరెడ్డి, వైస్ ఎంపీపీ అస్క రవి, ఏఎంసీ వైస్ చైర్మన్ పద్మయ్య, కో–ఆప్షన్ సభ్యుడు షాదుల్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కిషన్‌రెడ్డి, కృష్ణ, ప్రభాకర్, సర్పంచ్‌లు, కుల సంఘాల నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టేది ఎప్పుడో?

- పత్తా లేని ఆత్మకమిటీ ప్రమాణ స్వీకారం
- ఆదేశాలు వచ్చి ఆరునెలలు
- జాడలేని డైరెక్టర్ల నియామకం
- రైతులకు అందని ప్రయోజనాలు



ఆత్మకమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డికి నియామకపత్రం అందిస్తున్న ఏడీఏ పద్మ (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) కమిటీలతో రైతులకు సాగులో మెలుకువలు, రైతుల అభివృద్ధి కోసం ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఆత్మ కమిటీలను నియమించింది. కాగా ఆరునెలల క్రితం ఆత్మ చైర్మన్, డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినప్పటికి ఇంతవరకు ప్రమాణస్వీకర కార్యక్రమం పూర్తి కాకపోవడంతో అసలు కమిటీ ఉందా.. లేదా.. వారు అన్ని అయోమయంలో ఉన్నారు. దీంతో ఆత్మ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన రైతు అవగాహన సదస్సులు, ఆధునిక వ్యవసాయం రైతుల దరిచేరడంలేదు. వివరాలు ఇలా ఉన్నాయి.

2017లో కౌడిపల్లి వ్యవసాయ డివిజన్ ఏర్పాటు..

- తెలంగాణలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త మండలాలు, గ్రామ పంచాయతీలతో పాటు డివిజన్ కేంద్రాలను ఏర్పాటు చేసింది.
- అందులో భాగంగా 2017 కౌడిపల్లిలో వ్యవసాయ శాఖ డివిజన్ ఏర్పడింది.
- ఇందులో కౌడిపల్లి, వెల్దుర్తి, కొల్చారం, చిలప్‌చెడ్ మండలాలు ఉన్నాయి.
- రెండేళ్లకు గాను ఆత్మ కమిటీని ఏర్పాటు చేయగా, పదవీ రెండేళ్ల క్రితం పదవీకాలం పూర్తి అయింది.
- కారోనా కారాణంగా రెండేళ్లుగా ఆత్మ కమిటీని నియమించలేదు.
- 2022 ఆగష్టు నెలలో ప్రభుత్వం, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కృషితో ఆత్మ కొత్తకమిటీని నియమించారు.
- 2022 ఆగష్టు 25 ఆత్మ కమిటీ చైర్మన్‌గా వెల్దుర్తి మండలానికి చెందిన మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డితో సహ వైస్‌చైర్మన్, డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- దీంతో అదేరోజు ఏడీఏ పద్మ ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆత్మ చైర్మన్ నియమకపత్రం ప్రతాప్ రెడ్డికి అందజేశారు.
- త్వరలో ఆత్మ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌తో పాటు నాలుగు మండలాల నుంచి ఎంపికైన డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం ఉంటుందని అధికారులు, చైర్మన్ తెలిపారు.

ఆరునెలలు అవులున్నా.. ప్రమాణ స్వీకారం కాలే..

- ఆత్మ కమిటీ ఏర్పాటే.. ఆరునెలలు అవుతుండగా ఇప్పటి వరకు ఇంకా ప్రమాణ స్వీకారం జరగలేదు.
- ఆత్మ కమిటీ రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడం, క్షేత్రస్థాయి ప్రదర్శనలు, పంటల సాగులో మెలకువలు, సస్యరక్షణ చర్యలు వివరిస్తూ లాభసాటి వ్యవసాయంగా మార్చేందుకు కృషి చేస్తుంది. కానీ ఇంతవరకు రైతులకు వ్యవసాయ అధికారుల సూచనలు తప్ప ఆత్మ ఆధ్వర్యంలో ఎలాంటి కార్యక్రమాలు జరగడంలేదు.

నిరుత్సాహంగా డైరెక్టర్లు

- కౌడిపల్లి ఆత్మకమిటీలో నాలుగు మండలాలకు చెందిన 35 మందిని డైరెక్టర్లుగా ఎంపిక చేశారు.
- ఇప్పటివరకు వారికి నియామక పత్రాలు అందజేయలేదు. ప్రమాణ స్వీకారం సైతం జరగలేదు.
- రెండేళ్ల కాలవ్యవధి ఉండే నామినేటెడ్ పోస్టు కావడంతో ఇప్పటికే ఆరునెలలు అవుతున్నా.. తాము డైరక్టర్ల మా.. అనే సందేహంతో నిరుత్సాహంలోనే ఉన్నారు.
- ఇంకా డైరెక్టర్లకు ప్రమాణ స్వీకారం కాకపోవడంతో వ్యవసాయ కార్యాలయానికి సైతం వెళ్లడం లేదు.



కౌడిపల్లి వ్యవసాయ డివిజన్ కార్యాలయం

- చైర్మన్ మాత్రం మండల సమావేశాలకు హాజరవుతున్నారు.
- ప్రభుత్వం స్పందించి, ఆత్మకమిటీని ప్రమాణస్వీకారం చేయించి కార్యచరణ ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

ఆగష్టు నెలలో ఆత్మ కమిటీని నియమించారు. చైర్మన్‌గా వెల్దుర్తి మండలానికి చెందిన ప్రతాప్‌రెడ్డిని ప్రభుత్వం నియమించగా, నియామకం పత్రం అందజేశాం. చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లతో ప్రమాణస్వీకార కార్యక్రమం చేయాల్సి ఉంది. దీనికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

– పద్మ ఏడీఏ, కౌడిపల్లి

గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయపల్లి గోపి



మాట్లాడుతున్న సింగాయపల్లి గోపి

నర్సాపూర్ రూరల్: గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయపల్లి గోపి మండల కార్యవర్గ సభ్యులకు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పెద్దచింతకుంట జల హనుమాన్ ఆలయం ఆవరణలో మండలంలోని బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించగా. ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బూత్, శక్తి, అధ్యక్షులతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మోర్చా, కిసాన్ మోర్చా, మైనార్టీ మోర్చా అధ్యక్షులు, సభ్యులు, గ్రామ స్థాయిలో ఉన్న ప్రతీ బీజేపీ కార్యకర్త పార్టీ బలోపేతానికి నిరంతరం కష్టపడాలని కోరారు. గ్రామస్థాయిలో బీజేపీకి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు లేని విషయం గుర్తు పెట్టుకొని వచ్చే అన్ని రకాల ఎన్నికల్లో బీజేపీ నాయకుల గెలుపే ధ్యేయంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ కన్వీనర్ వల్దాస్ మల్లేశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు నర్సింహారావు నాయక్, పట్టణ అధ్యక్షుడు అంజనేయులు గౌడ్, ఆయా మోర్చా అధ్యక్షులు కుమార్, నగేష్, నరేష్, అనిల్, పద్మ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న రామాయంపేట మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని మెదక్ రోడ్డులో బాలాజీ ఫంక్షన్‌హాల్ వద్ద హనుమాన్ సేవాసమితి భవన నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ భూమిపూజ నిర్వహించారు. త్వరగా నాణ్యతతో భవన నిర్మాణం పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్, సేవాసమితి ప్రతినిధి, గురుస్వామి లాలాగౌడ్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాపు యాదగిరి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు గజవాడ నాగరాజు, కౌన్సిలర్లు, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెద్దశంకరంపేట(మెదక్): టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్ సౌజన్యంతో శివచంద్రా షెట్కార్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ గిరిజా షెట్కార్ ఆదివారం నిర్వహించిన చిన్న పిల్లల ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేశ్ షెట్కార్, మండల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధు, రాష్ట్ర ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి జనార్దన్ ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆయా గ్రామాల ప్రజలకు వైద్యులు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గంగారెడ్డి, సర్పంచ్ అంజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌గౌడ్, రాంచందర్, అశోక్, గౌస్, రాందాస్, శివ, విజయ్, మహిపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు



మాట్లాడుతున్న మాధవానంద సరస్వతీ

చేగుంట(తూప్రాన్): భక్తి భావంతోనే మానవత్వ విలువలు పెంపొందుతాయని రాంపూర్ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామీజీ అన్నారు. మండలంలోని కర్నాల్‌పల్లి సాయిబాబా ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మాధవానంద సరస్వతీతో పాటు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా మాధవానంద సరస్వతీ మాట్లాడుతూ.. భక్తిభావం కలిగిన వ్యక్తులు మానవత్వ విలువలను పాటిస్తారని అన్నారు. దేవాలయ ఉత్సవాల్లో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, సహకార సంఘం చైర్మన్ కొండల్‌రెడ్డి, తుమ్మ శ్రీనివాస్‌తో పాటు ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): నిరుపేదలైన దళితులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో నిర్వహించే దండోరా కార్యక్రమానికి సంబంధించిన ఎమ్మార్పీఎస్ టీఎస్ మండల అధ్యక్షుడు జనగామ స్వామి కరపత్రం ఆవిష్కరించారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు ఎమ్మార్పీఎస్ టీఎస్ మాదిగ నాయకులు అధిక సంఖ్యలో హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ సలహాదారుడు చంద్రం, నాయకులు లద్దస్వామి, బాలరాజ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చిట్కుల్‌లో అక్కమ్మతల్లి జాతర

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో సోమవారం అక్కమ్మతల్లి అలయ 25వ వార్షికోత్సవాలు జరగనున్నాయని గ్రామ పెద్దలు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఏటా అక్కమ్మ ఆలయ వార్షికోత్సవాలు గ్రామానికి చెందిన పంతులు నర్సింలు, పంతులు పండరి, పంతులు రవి కుమార్ ఆధ్వర్యంలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అన్నదానం ఉంటుందన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలు



శివ్వంపేట(నర్సాపూర్): క్యూలో భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా, హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయంలో బారులు తీరారు. దీంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

బంగారమ్మ ఆలయంలో..

మండల పరిధిలోని తిమ్మాపూర్ అరణ్యంలో కొలువైన బంగారమ్మ తల్లి జాతర ఆదివారం కనుల పండువగా జరిగింది. జాతరలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కొండపాక(గజ్వేల్): కుల సంఘాల భవన నిర్మాణాల కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ ర్యాగల్ల సుగుణ పేర్కొన్నారు. మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో రజక సంఘం భవన నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరవడంతో ఆదివారం సర్పంచ్ బడేకోలు లావణ్యతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుగుణ మాట్లాడుతూ.. గ్రామాల్లో కుల సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం పని చేస్తూ ఆదరణ పెంచుకుంటుందన్నారు. అన్ని కులాల వారి భవన నిర్మాణాలకు త్వరితగతిన నిధులు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జాలిగామ నర్సింగరావు, పీఆర్‌ఏఈ తిరుపతిరెడ్డి, నాయకులు యాదంరావు, నరేందర్, కిరణ్‌గౌడ్, బాలయ్య, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

చాముండేశ్వరీ ఆలయంలో భక్తుల రద్దీ



కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



తూప్రాన్: మల్కాపూర్‌లో..



తూప్రాన్: చెరువు నుంచి గంగాజలం తీసుకొస్తున్న గ్రామస్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ శివారులోని మంజీరా తీరంలో వెలసిన శ్రీ చాముండేశ్వరీ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవురోజు కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి శ్రీనల్లపోచమ్మదేవి ఆలయంలో ఉదయం ఈఓ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేష్ అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఆదివారం వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. డప్పు చప్పుళ్ల, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. పలువురు భక్తులు వాహనాలకు పూజలు చేశారు.

మల్కాపూర్‌లో..

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో మాఘ మాస పౌర్ణమి పురస్కరించుకొని ఆదివారం దుర్గామాత ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని చెరువులో నుంచి గ్రామస్తులు గంగా జలాన్ని తీసుకొచ్చి ప్రముఖ అర్చకుడు రఘురామశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం చేసి, ఒడిబియ్యం సమర్పించారు. అమ్మవారిని గంగాజలంతో అభిషేకం చేస్తే, సకల దోషాలు తొలగిపోయి, మంచి జరుగుతుందని రఘురామ శర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, దుర్గామాత సేవా సమితి సభ్యులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

తూప్రాన్: పట్టణంలోని కింది బస్తీలోని ఆ సంఘం కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఆ సంఘం నాయకులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామిళ్ల శ్రీనివాస్, ఉపాధ్యాక్షుడిగా సత్తయ్య, కార్యవర్గం సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మాజీ ఎంపీటీసీ నర్సింలు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మామిళ్ల కృష్ణ, యాదగిరి, వెంకటేశ్, మంద నాగేశ్, నరేందర్, నాగులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక లలితా సహస్రనామ పారాయణం

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని మర్పడ్గలో గల విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం క్షేత్రం నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో మాఘపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు గణపతి పూజ, స్వస్తిహవచనం, గోపూజ, సంతాన మల్లికార్జున స్వామికి, విజయదుర్గా మాతకు విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం నవావరణ హవనం, సుహాసినులు సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు.

బందారంలో..

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని బందారంలో నూతనంగా నిర్మించిన మహంకాళి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా ప్రధాన గడప ద్వారాన్ని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బ్రాహ్మనోత్తముల మంత్రోచ్చారణలతో ప్రతిష్ఠించారు. 1000 ఏళ్ల కిందట నిర్మించిన ఆలయం శిథిలావస్థలోకి చేరుకోవడంతో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఆలయాన్ని నిర్మించుకున్నారు. ఈ సందర్భంగా గణపతి పూజ, హోమం నిర్వహించారు.

‘ప్రతీ ఒక్కరు కష్టపడి పని చేయాలి’

మనోహరాబాద్(తూప్రాన్): ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలని బీజేపీ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ రామ్మోహన్‌గౌడ్ అన్నారు. మండలంలోని లింగారెడ్డిపేట గ్రామంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన రామ్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి ఇంటింటికీ తిరిగి బీజేపీ అభివృద్ధి నిధుల గురించి ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ కన్వీనర్ సాయిబాబా, మండల అధ్యక్షుడు నరేందర్‌చారి, ఆయా మోర్చాల అధ్యక్షులు, లింగారెడ్డిపేట బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

8న కొల్చారం దర్గా ఉర్సు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం కొల్చారంలోని హజ్రత్ షేక్ షహబోద్దీన్ దర్గా ఉర్సు ఈనెల 8న నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి 7 గంటలకు గంధం ఊరేగింపు ప్రారంభం అవుతుందన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌ని కలిసిన గోపాల్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): మండల కాంగ్రెస్ నాయకుడు అవుల గోపాల్‌రెడ్డి గాంధీ భవన్‌లో ఆదివారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మానిక్‌రావు ఠాక్రేను కలిశారు. ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే టికెట్‌ను కేటాయించాలని కోరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు నిర్వహించిన తాను డీసీఎంఎస్ జిల్లా డైరెక్టర్‌గా పనిచేశానని చెప్పారు. ప్రస్తుతం ఎంపీపీగా తన భార్య భాగ్యలక్ష్మి పని చేస్తున్నట్లు ఠాక్రేకు వివరించినట్లు వివరించారు. కాంగ్రెస్ బలోపేతానికి పని చేస్తున్న తాను మెదక్ నియోజకవర్గం నుంచి శాసనసభకు పోటీచేసే అవకాశం కల్పించాలని కోరానన్నారు.

నేడు పైతరలో కంటి వెలుగు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పైతర గ్రామంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హర్షిత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొల్చారం గ్రామ పంచాయతీ ఆవరణలో ఉదయం 9 గంటలకు నిర్వహించే కంటి వెలుగు శిబిరానికి పరీక్షలకు వచ్చేవారు తమ వెంట ఆధార్ కార్డును తీసుకొని రావాలని కోరారు.

కేలండర్ ఆవిష్కరణ

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని లకుడారంలో కురుమ యువ చైతన్య ఆధ్వర్యంలో కేలండర్‌ను ఆదివారం జిల్లా బీసీ అధ్యక్షుడు కందూరి ఐలయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ.. కురుమలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో మండల బీసీ అధ్యక్షులు ఎర్రోళ్ళ అనిల్, నాయకులు పుల్ల అశోక్, మహేందర్, యాదగిరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఖరిని ఎండగడుతాం



మాట్లాడుతున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం చెందిందని బీజేపీ జిల్లా నాయకులు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని బీజేపీ బూత్ లెవన్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం దత్తత గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇళ్లలో అవినీతి జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమావేశంలో మండలాధ్యక్షుడు రమేశ్, నాయకులు తిరుపతిరెడ్డి, కుషాల్‌సింగ్, ప్రవీణ్, రాజేందర్ సింగ్, మహేష్, ఆంజిరెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.